ఆంధ్రజ్యోతి
andhrajyothy.com బుధవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 25.6 ; కనిష్ఠం 23.3
నిజామాబాద్
జిల్లా వార్తలు
5
గురువారం 5 సెప్టెంబరు 2024



• మానిక్‌భండార్ వద్ద రోడ్డుపై నిలిచిన వరద



• కాలూర్ రోడ్‌లో నిలిచిన వరదలో వాహనదారుల ఇబ్బందులు

విడువని వాన



• కందకుర్తిలో నీట మునిగిన పంటలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

- జిల్లా వ్యాప్తంగా ఐదు రోజులుగా కురుస్తున్న వర్షాలు
- చెరువులు, కుంటల్లోకి భారీగా చేరుతున్న వరద
- దెబ్బతిన్న పంటలు, కూలిన ఇళ్లు, కోతకు గురైన రోడ్లు
- జిల్లాలో సరాసరి 62.1 మి.మీటర్ల వర్షపాతం నమోదు

నిజామాబాద్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాను ఐదు రోజులుగా వర్షాలు వీడడం లేదు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. పలుచోట్ల కల్వర్టులు దెబ్బతినడంతో రాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. నగరం పరిధిలో పలు కాలనీలకు నీళ్లు రాగా పూలాంగ్ వాగు పోటెత్తుతోంది. పలు చెరువులు మత్తడులు పడటం వల్ల రోడ్లపైకి నీళ్లు చేరి రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడ్డాయి. మానిక్‌భండార్ వద్ద చెరువు ఉప్పొంగడంతో రోడ్డుపై నుంచి భారీగా వరద పారుతోంది. న్యాల్‌కల్ రోడ్‌లో ఇళ్ల వద్దకు వరద చేరడంతో ఇబ్బంది పడ్డారు. దుబ్బ, ఖానాపూర్, కాలూర్ ప్రాంతంలో భారీగా రోడ్లపై ఈ వరద చేరడంతో రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడ్డాయి. కాలూర్ వద్ద వరద రోడ్లపైకి రావడంతో కొన్ని రైస్‌మిల్లులకు కూడా నీళ్లు చేరాయి. వరద ప్రాంతాలను మాజీ మంత్రి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ కూడా అధికారులతో కలిసి పరిశీలించారు. వారికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

అత్యధికంగా డొంకేశ్వర్ మండలంలో..

జిల్లాలో మంగళవారం రాత్రి నుంచి బుధవారం ఉదయం వరకు భారీ వర్షం నమోదైంది. జిల్లాలో సరాసరి 62.1 మిల్లీమీటరు వర్షం పడింది. జిల్లాలో అత్యధికంగా డొంకేశ్వర్ మండలంలో 16.2 సెంటీమీటర్ల వర్షం పడింది. మోపాల్ మండలంలో 14.1 సెంటీమీటరు వర్షం పడగా ఆలూర్‌లో 12.1 సెంటీమీటరు వర్షం పడింది. ఇందల్వాయిలో 11.3 సెంటీమీటర్ల వర్షం పడగా డిచ్‌పల్లిలో 10.1 సెంటీమీటరు వర్షం పడింది. వేల్పూర్‌లో 10 సెంటీమీటర్ల వర్షం నమోదైంది. ఆర్మూర్ మండలంలో 10.5 సెంటీమీటర్ల వర్షం పడింది. జిల్లాలో జూన్ నుంచి ఇప్పటి వరకు 714.4 మిల్లీమీటర్ల వర్షం పడాల్సి ఉండగా 919 మిల్లీమీటర్ల వర్షం పడింది. జిల్లాలోని అన్ని మండలాల పరిధిలో సగటు వర్షపాతం కంటే ఎక్కువగా వర్షం పడింది.

ఎస్సారెస్పీ దిగువకు కొనసాగుతున్న నీటి విడుదల

జిల్లాలో ఐదు రోజులుగా భారీగా వర్షాలు పడుతున్నాయి. ఈ వర్షాలకు శ్రీరాంసాగర్ నిండి వరద పోటెత్తుతుండగా గేట్లను ఎత్తి దిగువకు విడుదల చేస్తున్నారు. మంజీరాకు వరద పెరిగింది. భారీ వర్షాలకు జిల్లాలోని ప్రధాన వాగులు పొంగుతున్నాయి. కప్పలవాగు, పెద్దవాగు, పూలాంగ్ వాగుతో పాటు ఇతర వాగులు పోటెత్తుతున్నాయి. జిల్లాలో మొత్తం 1086 చెరువులు ఉన్నాయి. వీటిలో ఇప్పటి వరకు 836 చెరువులు పూర్తిగా నిండటంతో పాటు అలుగులు పారుతున్నాయి. జిల్లాలోని 216 చెరువుల్లో వంద శాతం నీళ్లు చేరగా, 33 చెరువుల్లో 75 శాతంలోపు నీళ్లు వచ్చాయి. గోదావరికి భారీ ఎత్తున వరద పోటెత్తుతుంది. జిల్లా వ్యాప్తంగా పడిన వర్షాలతో పలు గ్రామాల పరిధిలోని పంట చేనులు కూడా నీటమునిగాయి. జిల్లాలో పడుతున్న ఈ వర్షాలతో పలుచోట్ల రోడ్లకు గండ్లు పడ్డాయి. పంచాయతీరాజ్, రోడ్లు, భవనాల శాఖకు చెందిన రహదారులు దెబ్బతిన్నాయి. జిల్లాలో ఈ వర్షాలకు 91 ఇండ్లు పాక్షికంగా దెబ్బతిన్నాయి. ఆయా గ్రామాల పరిధిలో దెబ్బతిన్న ఇండ్ల వివరాలను రెవెన్యూ అధికారులు సేకరిస్తున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం వారికి సహాయం అందించనున్నారు.

జిల్లా వ్యాప్తంగా 1426 ఎకరాల్లో పంట నష్టం

జిల్లాలో కురుస్తున్న వర్షాల వల్ల గోదావరి పరీవాహక ప్రాంతంలోని పంటలు ఎక్కువగా దెబ్బతిన్నాయి. జిల్లాలో అధికారుల లెక్కల ప్రకారం 1426 ఎకరాల్లో పంటలు ప్రాథమికంగా దెబ్బతిన్నట్లు అధికారులు అంచనా వేశారు. జిల్లా వ్యాప్తంగా పలు గ్రామాల పరిధిలో వరి 294 ఎకరాల్లో దెబ్బతినగా, మొక్కజొన్న 20 ఎకరాల్లో దెబ్బతిన్నట్లు అంచనా వేశారు. జిల్లాలో అత్యధికంగా సోయాబిన్ పంట ఎక్కువ మొత్తంలో నీటమునిగి దెబ్బతిన్నట్లు అధికారులు వివరాలు సేకరించారు. బోధన్ మండలం పరిధిలో గోదావరి బ్యాక్ వాటర్ రావడం వల్ల హంగర్గ, బిక్నెల్లితో పాటు బోధన్ మండలంలోని మరికొన్ని గ్రామాల్లో కలిపి 1112 ఎకరాల్లో సోయాబిన్ పంటకు నష్టం జరిగినట్లు ప్రాథమిక అంచనా వేశారు. సిరికొండ, బోధన్ మండలాలే కాకుండా ఇతర మండలాల పరిధిలోని పంటల వివరాలను కూడా సేకరిస్తున్నారు.

వరద ప్రాంతాలను పరిశీలించిన ఎమ్మెల్యే

జిల్లాలో వరద ప్రాంతాలను మాజీ మంత్రి, బోధన్ ఎమ్మెల్యే పి.సుదర్శన్‌రెడ్డి పర్యటిస్తున్నారు. అధికారులతో కలిసి వర్షాలకు దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. నిజాంసాగర్, శ్రీరాంసాగర్ ప్రాజెక్టును అధికారులు, కాంగ్రెస్ ప్రజాప్రతినిధులతో కలిసి ఆయన పరిశీలించారు. అధికారులకు తగు సూచనలను చేశారు. ఆర్మూర్, భీంగల్ పర్యటించడంతో పాటు అక్కడి అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. ప్రత్యేక చర్యలు తీసుకొని వరదల వల్ల రైతులతో పాటు ప్రజలు ఇబ్బందులు ఎదుర్కోకుండా చూడాలని ఆదేశాలను ఇచ్చారు. కలెక్టర్, సీపీతో పాటు ఇరిగేషన్, రెవెన్యూ, పంచాయతీరాజ్, వైద్య ఆరోగ్య శాఖతో పాటు ఇతర అధికారులతో సమీక్షించడంతో పాటు ప్రజలకు అండగా ఉండాలని కోరారు. రోడ్లు, పంచాయతీరాజ్, ఇంజనీరింగ్ శాఖల అధికారులతో కూడా వివరాలను తీసుకున్నారు. ఎప్పటికప్పుడు సీఎం దృష్టికి తీసుకెళ్లడంతో పాటు కావాల్సిన నిధులను కూడా విడుదల చేసే విధంగా ప్రయత్నాలను చేశారు. బోధన్ మండలం పరిధిలోని బ్యాక్ వాటర్ ద్వారా నీటమునిగిన హంగర్గ, బిక్నెల్లి, రేంజల్ మండలాలను ఆయన అధికారులతో కలిసి పరిశీలించారు. ప్రభుత్వం రైతులు నష్టపోకుండా అన్ని రకాలుగా ఆదుకుంటుందని ఆయన తెలిపారు. కొన్ని చోట్ల పంటలు దెబ్బతిన్నాయని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిహారం అందే విధంగా చూస్తామని ఆయన తెలిపారు.



• మానిక్‌భండార్‌చౌరస్తాలో..



• నందిపేట పాలిటెక్నిక్ కళాశాల చుట్టూ చేరిన వరద



• చీమన్‌పల్లిలో దెబ్బతిన్న మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న అధికారులు



• డొంకేశ్వర్‌లోని తెప్పల మడుగు సమీపంలో నీటి మునిగిన వరి పంట



• కందకుర్తి వద్ద బ్రిడ్జిని తాకుతూ వెళ్తున్న గోదావరి



• నిజాంసాగర్ ప్రాజెక్టు గేటు నుంచి దిగువకు వెళ్తున్న నీరు



ఎస్సారెస్పీకి భారీగా వరద

41 గేట్ల ద్వారా దిగువకు నీటి విడుదల

నిజామాబాద్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు వరద భారీ ఎత్తున పోటెత్తుతోంది. ప్రాజెక్టుకు ప్రస్తుతం 3లక్షల 5వేల 692 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు నుంచి 41 గేట్ల ద్వారా 3లక్షల 58వేల 524 క్యూసెక్కుల నీటిని దిగువ గోదావరితో పాటు వరద కాలువ ద్వారా విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టులో 1091 అడుగులకు గాను 1089.60 అడుగులకు నీటిమట్టం చేరుకుంది. ప్రాజెక్టులో పూర్తిస్థాయి కెపాసిటీ 80.5 టీఎంసీలకు గాను 75.314 టీఎంసీల నీళ్లు చేరాయి. మహారాష్ట్ర నుంచి గోదావరికి 3లక్షల క్యూసెక్కుల వరకు వరద వస్తుండగా గడ్డెన్నవాగు నుంచి కూడా వరద ప్రాజెక్టులోకి వచ్చి చేరుతోంది. ఈ వరదే కాకుండా జిల్లాలోని మంజీరా నుంచి మరి కొంత వరద వస్తుండటంతో దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. గేట్ల నుంచే కాకుండా వరద కాలువ ద్వారా మిడ్‌మానేరుకు 19వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. కాకతీయ కాలువకు 4వేల క్యూసెక్కులు, ఎస్కేప్ గేట్ల ద్వారా జల విద్యుత్ ఉత్పత్తికి 4వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

ఉధృతంగా ప్రవహిస్తున్న కందకుర్తి

మంజీరా, హరిదా నదుల ద్వారా కూడా వరద వచ్చి చేరుతుండటం వల్ల కందకుర్తిలోని త్రివేణి సంగమం వద్ద గోదావరి పోటెత్తుతోంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టంకు చేరుతుండటంతో బ్యాక్ వాటర్ వల్ల గోదావరి పక్కనే ఉన్న పంట చేనుల్లోకి కూడా నీళ్లు చేరాయి. కందకుర్తి వద్ద బ్రిడ్జికి సమాంతరంగా వరద వెళ్తుండటంతో రాకపోకలను కూడా నిలిపివేశారు. అంతర్రాష్ట్ర బ్రిడ్జి వద్ద చెక్‌పోస్టును ఏర్పాటు చేసి వాహనాలను నియంత్రిస్తున్నారు. ప్రాజెక్టులోకి జూన్ నుంచి ఇప్పటి వరకు 120 టీఎంసీల నీళ్లు వచ్చి చేరాయి. ప్రాజెక్టు నుంచి 55 టీఎంసీల నీటిని ఈ మూడు రోజుల్లోనే దిగువ గోదావరికి విడుదల చేశారు. ప్రాజెక్టులోకి మహారాష్ట్ర నుంచే భారీగా వరద వచ్చి చేరుతుందని ఎస్సారెస్పీ ఎస్ఈ శ్రీనివాస్‌గుప్త, ఈఈ చక్రపాణి, ఏఈలు వంశీ, రామారావు, రవిలు తెలిపారు.

కెపాసిటీ తగ్గుతున్నా.. రైతులకు భరోసా ఇస్తున్న ఎస్సారెస్పీ

ఉత్తర తెలంగాణ రైతులకు ఎస్సారెస్పీ నాలుగు దశాబ్దాలుగా భరోసాను అందిస్తోంది. ప్రాజెక్టు వల్ల ఉత్తర తెలంగాణ ఆయకట్టుకు సాగునీరు అందుతోంది. ప్రాజెక్టు నిర్మాణం అయిన తర్వాత ఆయకట్టు పరిధిలో పంటల సాగు విస్తీర్ణం భారీగా పెరిగింది. నిజామాబాద్, నిర్మల్, జగిత్యాల, పెద్దపల్లి, కరీంనగర్, హన్మకొండ, వరంగల్, మహబూబాబాద్, సూర్యాపేట్ జిల్లాల వరకు ఈ ప్రాజెక్టు నుంచి నీటి విడుదల కొనసాగుతోంది. ప్రాజెక్టు నిర్మాణమై రైతులకు అందుబాటులో వచ్చిన తర్వాత ఆరుసార్లు మినహా మిగతా 34 సంవత్సరాలు ప్రాజెక్టు నిండింది. ప్రతీసారి ఆగస్టు లేదా సెప్టెంబర్ నెలల్లోనే ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టానికి చేరుకోవడంతో పాటు గేట్ల ద్వారా నీటిని విడుదల చేస్తున్నారు. నాలుగు దశాబ్దాల్లో 32 టీఎంసీల వరకు కెపాసిటీ తగ్గినా ఇప్పటికీ రైతులను ఈ ప్రాజెక్టే ఆదుకుంటుంది. ప్రాజెక్టు నిర్మాణం చేసినప్పుడు 112 టీఎంసీలుగా డిజైన్ చేశారు. ప్రాజెక్టులోకి ఎక్కువగా ఇసుక చేరడం వల్ల ఈ నాలుగు దశాబ్దాల్లో 32 టీఎంసీల వరకు నష్టపోయి ప్రస్తుతం 80.5 టీఎంసీల కెపాసిటీకి చేరింది. కాళేశ్వరం ఎత్తిపోతల పథకం నిర్మాణమైన ఈ ప్రాజెక్టు నుంచే ఉత్తర తెలంగాణ జిల్లాలోని రైతులకు రెండు పంటలకు సాగునీరు అందుతోంది. ఈ ప్రాజెక్టు నుంచి మిడ్‌మానేరుకు, లోయర్‌మానేరు డ్యామ్‌కు నీటిని తరలించి సూర్యపేట జిల్లా వరకు కాకతీయ కాలువ స్టేజ్-2 ఆయకట్టుకు కూడా నీటిని అందిస్తున్నారు. ప్రాజెక్టు పరిధిలో ఒక్క సీజన్‌లోనే 12లక్షల ఎకరాల వరకు సాగు నీరును అందిస్తున్నారు. రెండోసీజన్‌లో కూడా నీటి నిల్వలను బట్టి 9 నుంచి 12లక్షల ఎక రాల వరకు యాసంగిలో నీటిని విడుదల చేస్తున్నారు.

నిజాంసాగర్ గేటు ఎత్తివేత

నిజాంసాగర్, సెప్టెంబరు 4: కామారెడ్డి జిల్లా నిజాంసాగర్ ప్రాజెక్ట్‌లోకి భారీగా వరద వచ్చిచేరుతుండడంతో బుధవారం బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రి చైర్మన్ కాసులబాల్ రాజ్‌తో కలిసి ఒక గేటు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిజాంసాగర్ ప్రాజెక్ట్‌లో ప్రస్తుతం 15.5 టీఎంసీల నీరు నిల్వ ఉండగా ఎగు వభాగం నుంచి 24 వేల క్యుసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుందని తెలిపారు. సింగూర్ ప్రాజెక్ట్‌లో 26 టీఎంసీల నీరు నిల్వ ఉండగా సింగూర్‌కు ఎగువభాగం నుంచి 46 వేల క్యుసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుందని తెలిపారు. దీంతో నిజాంసాగర్ ప్రాజెక్ట్ ఆరోనంబర్ గేటు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేశామని ఆయన తెలిపారు.

ముస్లిం రిజర్వేషన్లు రద్దు చేసేందుకు కేంద్రం కుట్ర

• రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ

నిజామాబాద్ అర్బన్, సెప్టెంబరు 4: తెలంగాణలో ముస్లింలకు, మైనార్టీలకు అమలవుతున్న 4 శాతం రిజర్వేషన్లను రద్దు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్ర చేస్తోందని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ అన్నారు. మైనార్టీలకు నాలుగు శాతం రిజర్వేషన్‌లు సాధించి 30 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా బుధవారం నగరంలోని కొజాకాలనీ ప్రైమ్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ముస్లిం రిజర్వేషన్‌లను రద్దు చేస్తామని కేంద్ర మంత్రి అమిత్‌షా చేసిన వ్యాఖ్యలను షబ్బీర్ అలీ గుర్తు చేశారు. రాష్ట్రంలో ముస్లిం, మైనార్టీల రిజర్వేషన్‌లను రద్దు చేయడం ప్రధాని మోదీ, కేంద్రమంత్రి అమిత్‌షాలకు సాధ్యం కాదన్నారు. ముస్లిం, క్రిస్టియన్, మైనార్టీల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో ముస్లింలకు 4శాతం రిజర్వేషన్‌ల కోసం ఎంతో కష్టపడి పోరాడి తీసుకువచ్చామన్నారు. తాము ఇప్పటికీ కోర్టుల చుట్టూ తిరుగుతూ పోరాడుతున్నామని తెలిపారు. ముస్లిం రిజర్వేషన్‌లను కాపాడుకోవడం తమ బాధ్యత అని షబ్బీర్ అలీ అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు గడుగు గంగాధర్, కేశవేణు, రత్నాకర్, జావెద్ అక్రమ్, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న షబ్బీర్‌అలీ

అనన్య కుటుంబానికి పరామర్శ..

ఇటీవల నగరంలోని ఆనంద్‌నగర్ నాలాలో కొట్టుకుపోయిన చిన్నారి అనన్య కుటుంబాన్ని బుధవారం షబ్బీర్‌అలీ పరామర్శించారు. ఓపెన్ డ్రైనేజీలో పడి చిన్నారి చనిపోవడం దురదృష్టకరమని వారి కుటుంబానికి జరిగిన విషాదాన్ని ఎవరూ పూడ్చలేరన్నారు. తనవంతుగా 25వేల రూపాయల చెక్కును ఆయన అందజేశారు. ప్రభుత్వం నుంచి 4లక్షల ఎక్స్‌గ్రేషియా అందేలా చూస్తామన్నారు. ఇలాంటి ఘటనలు మళ్లీ జరుగకుండా అధికారులు ప్రమాదకరమైన నాలాలను గుర్తించి మరమ్మతులు చేపట్టాలని ఆదేశించారు.

వరద ప్రాంతాల్లో పర్యటించిన షబ్బీర్ అలీ..

నగరంలో వరద ప్రాంతాల్లో బుధవారం ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ పర్యటించారు. రాష్ట్ర వ్యాప్తంగా కురుస్తున్న వర్షాల వల్ల నగరంలో వరదలు వచ్చాయని లోతట్టు ప్రాంతాల్లో తిరుగుతూ వారి సమస్యలను తెలుసుకున్నారు. వర్షాల వల్ల ఇండ్లలోకి నీరు చేరి భారీ నష్టం జరిగిందని అనేక ప్రాంతాల్లో లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయని అన్నారు.





పూజలు చేస్తున్న దృశ్యం

గురుద్వార్‌లో ఘనంగా పహలా ప్రకాశ్ ఉత్సవం


నిజామాబాద్ కల్చరల్, సెప్టెంబరు 4: సిక్కులు పరమ పవిత్రంగా భావించే పహలా ప్రకాశ్ పూరబ్ ఉత్సవాన్ని బుధవారం ఘనంగా జరుపుకున్నారు. నగరంలోని గురుద్వార్‌లో పూజారులు గురుగ్రంథీలను పఠించారు. నాందేడ్ నుంచి వచ్చిన బాబ్జీ సర్దార్ నహర్‌సింగ్, సాద్ సంగత్‌లు ప్రత్యేక పూజలు, భజనలు చేశారు. అనంతరం గురుద్వారా ప్రబంధ కమిటీ ఆధ్వర్యంలో మహా అన్నప్రసాదాన్ని నిర్వహించారు.

ప్రారంభమైన జెండా జాతర ఉత్సవాలు

నిజామాబాద్ కల్చరల్, సెప్టెంబరు 4: కలియుగ ప్రత్యక్ష దైవం భక్తుల కొంగు బంగారంగా నిలిచిన జెండా బాలాజీ జాతర ఉత్సవాలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆలయ వంశ పారంపర్య అర్చకులు అజయ్ సంగ్వాయ్ జెండా, ఉత్సవ మూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజలు నిర్వహించిన జెండాను నగరంలోని పెద్ద బజార్, గాజుల్‌పేట్, బ్రహ్మపురి, చక్రం గుడి, అశోక్‌వీధి, బొబ్బిలివీధి, కసాబ్‌గల్లీ, శివాజీనగర్ తదితర ప్రాంతాల్లో భక్తుల దర్శనార్థం ఊరేగించారు. మేళతాళాలతో సాగిన జెండా ఊరేగింపు భక్తులు మంగళహారతులతో ఘనంగా స్వాగతం పలికారు. ఆలయానికి చేరుకున్న జెండాకు వంశ పారంపర్య అర్చకులు సంజీవ్ సంగ్వాయ్, విజయ్ సంగ్వాయ్, ఆలయ కార్యనిర్వహణ వేణు, ఆలయ అర్చకులు వెలగలేటి నాగరాజ చార్య, ఆలయ చైర్మన్ జాలిగం గోపాల్, పాలకమండలి సభ్యులు ఘనంగా స్వాగతం పలికారు. ఆలయం చుట్టూ జెండాను ప్రదక్షిణగావించి జెండాను ప్రతిష్ఠించారు. నాటి నుంచి వస్తున్న ఉత్సవ విగ్రహాలకు వేదపండితులు వేద మంత్రోచ్చరణలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్ ప్రశాంత్, ఆలయ భక్తులు తదితరులు పాల్గొన్నారు.



పూజలు చేస్తున్న అర్చకులు






శాంతి కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్, హాజరైన శాంతి కమిటీ సభ్యులు

వినాయక చవితి, మిలాద్-ఉన్-నబీ వేడుకలు ప్రశాంతంగా జరుపుకోవాలి

● శాంతి కమిటీ సమావేశంలో కలెక్టర్

నిజామాబాద్ అర్బన్, సెప్టెంబరు 4: జిల్లాలో ప్రశాంత వాతావరణంలో వినాయక చవితి, మిలాద్-ఉన్-నబీ వేడుకలు జరుపుకోవాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు పిలుపునిచ్చారు. ఈ ఉత్సవాలను పురస్కరించుకొని సమీకృత కలెక్టరేట్‌లో బుధవారం శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. అనంతరం కలెక్టర్, సిపి సంబంధిత అధికారులతో సమన్వయ సమావేశం ఏర్పాటు చేసి కీలక సూచనలు చేశారు. మిలాద్-ఉన్-నబీ, గణేష్ ఉత్సవాల సందర్భంగా చేపట్టాల్సిన చర్యలు, అందుబాటులోకి తేవాల్సిన సదుపాయాల గురించి సార్వజనిక్ గణేష్ మండలి ప్రతినిధులు, శాంతి కమిటీ సభ్యులు, ముస్లిం మతపెద్దలు, మండపాల నిర్వహకులు పలు ప్రతిపాదనలు చేస్తూ తమ అభిప్రాయాలను వెల్లడించారు. శాంతియుత వాతావరణంలో భక్తిశ్రద్ధలతో మత సామరస్యానికి ప్రతీకగా వేడుకలు జరిగేలా తోడ్పాటును అందిస్తామన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఉత్సవాల నిర్వహణకు జిల్లా యంత్రాంగం తరఫున పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని రోడ్ల మరమ్మతులు, శోభాయాత్రకు అడ్డంకిగా ఉండే చెట్ల కొమ్మలు తొలగించడం వంటి పనులను యుద్ధప్రాతిపదికన చేపట్టడం జరుగుతుందని అన్నారు. జిల్లాలో ఎంతో సహృద్భావ వాతావరణం లో ఈ వేడుకలు జరుగుతాయని ఈ సారి కూడా అదే స్ఫూర్తిని ప్రదర్శిస్తూ ఉత్సవాలు జరుపుకొని జిల్లాను ఆదర్శవంతంగా నిలపాలన్నారు. గత యేడాది తరహాలోనే ఈసారి కూడా వినాయక నిమజ్జనం, మిలాద్-ఉన్-నబీ వేడుక ఒకేసారి వస్తున్నందున భద్రతా పరమైన చర్యలకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా వ్యాప్తంగా ఎక్కడ కూడా అవాంఛనీయ సంఘటనలకు తావివ్వకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఏకదాటిగా వర్షాలు కురుస్తున్నందున మండపాల ఏర్పాట్లలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని ఎవరూ కూడా విద్యుఘాతం బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. మండపాలకు ఉచితంగా ప్రభుత్వం తరఫున విద్యుత్ సరఫరా చేయనున్నందున మండపాల వివరాలను ట్రాన్స్‌కో అధికారులకు అందజేస్తే వారే విద్యుత్ కనెక్షన్ ఏర్పాటు చేస్తారని అన్నారు. భారీ శబ్దాల వల్ల చిన్నారులు, వృద్ధులు ఇబ్బందులకు గురయ్యే అవకాశం ఉన్నందున మండపాల వద్ద శబ్దకాలుష్యం కలిగించేలా డీజే సౌండ్‌లు పెట్టవద్దని, భక్తిపాటలు, భజనలతో మంచి వాతావరణంలో వేడుకలు చేసుకోవాలన్నారు. సమస్యాత్మక ప్రాంతాలు, ప్రార్థన మందిరాల వద్ద సీసీ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేస్తామని నిజామాబాద్ నగరంలో 750కి పైగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేయనున్నట్లు సీపీ కల్మేశ్వర్ తెలిపారు. కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్, కమిషనర్ మకరంద్, ట్రైనీ కలెక్టర్ సంకేత్, డిప్యూటీ మేయర్ ఇద్రిస్‌ఖాన్, అదనపు డీసీపీలు కోటేశ్వర్ రావు, బస్వారెడ్డి, ఆర్‌డీవోలు అంబదాస్, రాజేశ్వర్, రాజాగౌడ్, నిజామాబాద్ ఏసీపీ రాజావెంకట్‌రెడ్డి, అధికారులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

బాధితులను ప్రభుత్వాలు ఆదుకోవాలి

పెద్దబజార్, సెప్టెంబరు 4: వర్షాలకు నష్టపోయిన ప్రజలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని బహుజన లెఫ్ట్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు సబ్బనిలతా డిమాండ్ చేశారు. బుధవారం నగరంలోని బీఎల్‌ఎఫ్ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. ఐదు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో దెబ్బతిన్న పంటలకు, ఇండ్లు నష్టపోయిన ఇతర ప్రజల ఆస్తులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే ఆర్థిక సహాయం అందించాలని కోరారు. వర్షాలకు దెబ్బతిన్న రోడ్లు, వంతెనలు, తెగిపోయిన చెరువులు, కుంటల మరమ్మతులను వెంటనే చేపట్టాలని కోరారు. భారీ వర్షాలకు ఉపాధి కోల్పోయిన రోజువారి వ్యవసాయ కార్మికులు, భవన నిర్మాణ కార్మికులకు, ఆటో కార్మికులకు 5వేల రూపాయలు, 50కిలోల బియ్యం పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. నగర కమిటీ నాయకులు చంద్రగౌడ్, శాంతాబాయి, రమ్య పాల్గొన్నారు.

'విద్యార్థుల ఆత్మహత్యలపై ప్రభుత్వం దృష్టి సారించాలి'


డిచ్‌పల్లి, సెప్టెంబరు 4: ప్రభుత్వ విద్యాసంస్థలు విద్యార్థుల ఆత్మహత్యలకు నిలయాలుగా మారుతున్నాయని వాటిపై ప్రభుత్వం దృష్టిసారించాలని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జన్నారపు రాజేశ్వర్ అన్నారు. విద్యార్థిని రక్షిత మృతిపై సమగ్ర దర్యాప్తు చేయాలని ప్రభుత్వం విద్యార్థి కుటుంబానికి న్యాయం చేయాలని డిచ్‌పల్లి ప్రభుత్వ ఇంటర్ కాలేజీలో విద్యార్థులతో సంతకాల సేకరణ చేపట్టారు. బాధ్యులను కఠినంగా శిక్షించాలని విద్యార్థి కుటుంబానికి ప్రభుత్వం రూ.50లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని డిమాండ్ చేశారు. పీవైఎల్ జిల్లా సహాయ కార్యదర్శి సాయినాథ్, పీడీఎస్‌యూ నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బాధిత రైతులను ఆర్థికంగా ఆదుకోవాలి

సిరికొండ సెప్టెంబరు 4: అధిక వర్షాల వల్ల పంటలు దెబ్బతిన్న రైతులను ఆర్థికంగా ఆదుకోవాలని అఖిల భారత రైతుకూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భాస్కర్ ప్రభుత్వాన్ని కోరారు. భారీ వర్షాల వల్ల అనేక పంటలు దెబ్బతిన్నాయని, రోడ్లు, వంతెనలు ధ్వంసమయ్యాయని అన్నారు. రైతులు ఎన్నో కష్టనష్టాలకోర్చి సాగుచేసిన పంటలన్నీ వరదల పాలయ్యాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. నిరాశ్రయులైన వారిని ఆదుకోవాలని భాస్కర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇండ్లు దెబ్బతిన్న వారికి ఇండ్లు నిర్మించి ఇవ్వాలని, వరదల కారణంగా మృతి చెందిన వారి కుటుంబాలకు రూ.25 లక్షల ఎక్స్‌గ్రేసియా చెల్లించాలని భాస్కర్ రాష్ట్ర ప్రభుత్వానికి కోరారు.

జాబ్ క్యాలెండ్ ఆవిష్కరణ

పెద్దబజార్, సెప్టెంబరు 4: ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎదురు చూసే అభ్యర్థులకు ఒక గొప్ప అవకాశం తెలంగాణలో జాబ్ క్యాలెండర్ ఆవిష్కరించినట్లు అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ తెలిపారు. ప్రతీరోజు ఫిజికల్ కోచింగ్, వారియర్ స్టడీసర్కిల్ సెంటర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పల్లెప్రాంత అభ్యర్థులను దృష్టిలో పెట్టుకొని వేలాది మంది నిరుద్యోగులకు ఉద్యోగులుగా తీర్చిదిద్ది 18 సంవత్సరాలు పైబడిందన్నారు. అధ్యాపక బృందంచే ఆంధ్ర, తెలంగాణ ఎస్సై, కానిస్టేబుల్, ఆర్‌పిఎఫ్, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్, గ్రూప్-2, 3, 4, ఎన్‌సిసి, కానిస్టేబుళ్లకు ప్రతీరోజు క్లాసులు, పరీక్షలు నిర్వహిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ రమాకాంత్, జడ్పీచైర్మన్ దాదన్నగారి విఠల్, న్యాయవాది మధుసూదన్, తదితరులు పాల్గొన్నారు.





మంగల్‌పాడ్ జిల్లా పరిషత్ పాఠశాలలో చోరీ



పాఠశాలలో చోరీకి గురైన కంప్యూటర్

ఎడపల్లి, సెప్టెంబరు 4: ఎడపల్లి మండలంలోని మంగల్‌పాడ్ గ్రామంలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో దొంగతనం జరిగినట్లు ఎడపల్లి ఎస్సై వంశీ కృష్ణారెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం మంగల్‌పాడ్ గ్రామ శివారులో ఉన్న ప్రభుత్వ పాఠశాల సిబ్బంది బుధవారం ఉదయం పాఠశాలకు వచ్చే సరికి తాళం పగుల గొట్టి ఉండడంతో లోనికి వెళ్లి చూడగా కంప్యూటర్‌ను దొంగిలించినట్లు తెలుసుకుని పోలీసులకు సమాచారం అందించడంతో సంఘటనా స్థలాన్ని పరిశీలించిన పోలీసులు పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు వెంకటేశం ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి: దినేష్



సిరికొండలో దోన్ల వాగును పరిశీలిస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు

సిరికొండ సెప్టెంబరు 4: మండలంలో పలు వర్ష ప్రభావ ప్రాంతాలను పరిశీంచిన బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారి. దశాబ్దాలు గడిచిన దోన్లవాగుపై వంతెన నిర్మాంచరా అంటూ బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.దెబ్బతిన్న పంటలు, రోడ్లను బుధవారం మండలంలోని సిరికొండ గడ్కోల్ తదితర గ్రామాల్లో దినేష్ పర్యటించి పరిశీలన చేశారు. సిరికొండలో ఆయన మాట్లాడుతూ అరగంట వర్షం కురిస్తే చాలు దోన్లవాగు వంతెన దాటనీయదని గుర్తు చేశారు. హైలెవల్ వంతెన నిర్మాణం జరుగక పోవడం మూలంగా భీమ్‌గల్,కమ్మర్‌పల్లి, మోర్తాడ్ మండలాలకు చెందిన నలుబై గ్రామాల ప్రజలు ఇబ్బంది పడుతున్నారని అన్నారు. ఈ ప్రాంతానికి చెందిన మాజీ మంత్రులు సంతోష్‌రెడ్డి, మండవ వెంకటేశ్వర్‌రావు చేసిన చిన్నపాటి వంతెన నిర్మించడానికి చర్యలు తీసుకోక పోవడం సిగ్గుచేటన్నారు. దెబ్బతిన్న రోడ్లను,కల్వర్టులకు తాత్కాలిక మరమ్మతు పనులు చేయించాలని,పంటలు దెబ్బ తిన్న రైతులను ఆదుకోవాలని దినేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మోడల్ స్కూల్ ఆవరణలో వరద నీళ్లు నిలిచాయని కలెక్టర్‌తో వీడియో కాల్‌లో మాట్లాడారు. ఆడపిల్లలుండే హాస్టల్ ముందర కూడ వరద నీళ్లు నిలిచిపోయాయని ఆయన కలెక్టర్ దృష్టికి తీసికెళ్లారు. ప్రభుత్వం నీళ్లు నిలిచిన ప్రదేశంలో మొరాన్ని వేయించాలని దినేష్ కోరారు. ఆయన వెంట బీజేపీ నాయకులు రాజేశ్వర్ రెడ్డి,రామస్వామి, సంద్రశంకర్,మాలోత్ మహేందర్ నాయక్,రంజిత్‌రెడ్డి,అజయ్,మారుతి, స్లీక్ నర్సయ్య, సుమన్ తదితరులు ఉన్నారు.

వృద్ధాశ్రమంలో పండ్ల పంపిణీ

మోస్రా,సెప్టెంబరు4: మండలంలోని చింతకుంట గ్రామంలో గల అనాథ వృద్ధాశ్రమంలో వాసవీ వనిత సంస్థ ఇంటర్నేషనల్ అధ్యక్షుడు రవిచంద్రన్ ఆదేశానుసారం బోధన్ వాసవీ, వనిత క్లబ్‌లు ఇంటర్నేషనల్ ట్రెజరర్ సిల్వర్ స్టార్ కేసీజీఎఫ్ కొత్త రవీందర్ ఆధ్వర్యంలో చింతకుంటలో గల వృద్ధాశ్రమంలో పండ్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు. 1116 రూపాయలు వాసవీ అండ్ వనిత క్లబ్ తరపున డొనేషన్ ఇవ్వడం జరిగిందని ఆశ్రమ ఇన్‌చార్జి తెలిపారు. ఈ కార్యక్రమంలో వనిత క్లబ్ ప్రెసిడెంట్ శాంతిశ్రీ, వాసవీ క్లబ్ సెక్రెటరీ సూర్యారావు పాల్గొన్నారు.

లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో వైద్యశిబిరం

భీమ్‌గల్, సెప్టెంబరు 4: పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో ఆయుష్ శాఖ డాక్టర్ శ్రీలేఖ ఆధ్వర్యంలో బుధవారం వైద్యశిబిరాన్ని నిర్వహించారు. శిబిరానికి హాజరైన వృద్ధులకు రక్తపోటు, మధుమేహం, కీళ్ళనొప్పులు, తదితర వ్యాధులకు చికిత్సను చేసి మందులను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హోమియో సేవలను ప్రతీఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ శిబిరంలో డీపీఎం వందన, సీహెచ్ డాక్టర్ అజయ్, పవర్, ఫార్మసిస్ట్ బాబురావు, సుజాత, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

'ఉచిత శిక్షణను వినియోగించుకోవాలి'

భీమ్‌గల్, సెప్టెంబరు 4: నిరుద్యోగులకు ప్రభుత్వం న్యాక్ ద్వారా అందజేస్తున్న ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకొని ఉపాధి పొందాలని అసిస్టెంట్ లెబర్ ఆఫీసర్ ప్రభుదాస్ తలిపారు. బుధవారం పట్టణ కేంద్రంలోని న్యాక్ శిక్షణ కేంద్రాన్ని సందర్శించారు. లెబర్‌కార్డు యొక్క ప్రయోజనాలను శిక్షణ పొందుతున్న వారికి తెలియజేశారు. ఈ సందర్భంగా ఎలక్ట్రికల్, టైలరింగ్ విభాగంలో శిక్షణ తీసుకుంటున్న అభ్యర్థులకు టీషర్ట్‌లు, బుక్స్ బ్యాగ్స్, అప్రాన్స్, రికార్డు బుక్స్‌లు అందజేశారు. కార్యక్రమంలో న్యాక్ ఉమ్మడి జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్ ప్రభాకర్, లేబర్ ఆఫీసర్ నరేందర్ రాజు (బోదన్) న్యాక్ భీమ్‌గల్ సెంటర్ ఇన్‌చార్జి దిలిప్‌గౌడ్, ట్రైనర్ పుష్ప, సిబ్బంది, గంగాధర్, గౌస్ పాల్గొన్నారు.

యునాని వైద్యశాలలో వైద్యశిబిరం

వేల్పూర్, సెప్టెంబరు 4: వేల్పూర్ మండలం పచ్చలనడ్కుడ గ్రామంలోని ప్రభుత్వ యునాని వైద్యశాలలో బుధవారం వృద్ధాప్య వైద్యశిబిరాన్ని నిర్వహించారు. శిబిరంలో డీపీఎం వందన ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రాచీన కాలం నాటి భారతీయ వైద్యంలో భాగంగా ప్రభుత్వం వృద్ధాప్య వైద్యశిబిరం నిర్వహించడం జరిగిందన్నారు. ఈ శిబిరం ద్వారా దీర్ఘకాలిక వ్యాధులను, ఇతర అన్ని రకాల వ్యాధులకు ఉచితంగా పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను అందజేయడం జరుగుతుందన్నారు. శిబిరంలో గ్రామానికి చెందిన 139 మంది వృద్ధ పేషెంట్‌లకు ఆయుర్వేద పరీక్షలు చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి నవనీత, గ్రామానికి చెందిన మాజీసర్పంచ్ ఏనుగు గంగారెడ్డి, యునాని వైద్యుడు సయ్యాద్, సహజంద్, ఫాతిమ, శకుంతల, రమేష్, స్వామి, తదితరులు పాల్గొన్నారు.

'పిల్లలకు పౌష్టికాహారం అందించాలి'

కమ్మర్‌పల్లి, సెప్టెంబరు 4: పిల్లల ఎదుగుదల నిమిత్తం ప్రభుత్వం అంగన్‌వాడీ సెంటర్ల ద్వార పౌష్టికాహారం అందజేస్తున్నదని సెంటర్ల నిర్వాహకులు తూచా తప్పకుండా అందించాలని గ్రామ ప్రత్యేక అధికారి, మండల పంచాయతీ అధికారి సదాశివ్ ఉన్నారు. బుధవారం గ్రామంలోని అంగన్‌వాడీ సెంటర్ల పిల్లల, తల్లులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పిల్లల ఎదుగుదలకు పౌష్ఠకాహారం ఎంతో అవసరమన్నారు. అదేవిధంగా తల్లులు తమకందించే పౌష్టికాహారాన్ని తప్పక తీసుకోవాలని సూచించారు. పిల్లలు, తల్లులు ఆరోగ్యంగా ఉండడానికి కోడిగుడ్లు, ఆకుకూరలు, బెల్లం, క్యారెట్, ఆలుగడ్డలు,తదితర పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. అనంతరం పిల్లల ఎదుగుదల, బరువును పరిశీలించారు. కార్యక్రమంలో ఉప్లూర్ గ్రామ పంచాయతీ కార్యదర్శి నరేందర్, అంగన్ వాడి నిర్వహకులు, అశావర్కర్‌లు, ఆయాలు, పిల్లలు తల్లులు పాల్గొన్నారు.

కళాశాలలో ఫ్రెషర్స్‌డే వేడుకలు

భీమ్‌గల్, సెప్టెంబరు4: పట్టణ కేంద్రంలోని ఎస్ఆర్ జునియర్ కళాశాలలో బుధవారం ఫ్రెషర్స్ పార్టీ వేడుకలను జరుపుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బీసీ స్టడి సర్కిల్ డైరెక్టర్ వెంకన్న హాజరై ఆయన మాట్లాడుతూ కళాశాల విద్యలో ఇంటర్మీడియట్ విద్య అనేది చాలా కీలకమని, ఇక్కడే ఒక లక్ష్యం ఏర్పాటు చేసుకోవాలన్నారు. విద్యార్థులు జీవితంలో ఉన్నత శిఖరాలు అదిరోంచి, దానికి అనుగుణంగి ముందుకు సాగాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థినిలు పాటలపై నృత్యాలు చేస్తూ అలరించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ నవీన్ యాదవ్, ప్రిన్సిపాల్ రణదేవ్, అధ్యాపకులు స్రవంతి, శ్రీనివాస్, సంతోష్, సహ, అలేఖ్య, అమూల్య, వీణ, అశోక్, విద్యార్థినిలు పాల్గొన్నారు.

ప్రశాంత వాతావరణంలో పండుగను జరుపుకోవాలి



రుద్రూరు శాంతి కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న ఏసీపీ



కోటగిరిలో..

రుద్రూరు, సెప్టెంబరు 4 : ప్రశాంత వాతావరణంలో పండుగను జరుపుకోవాలని ఏసీపీ శ్రీనివాస్‌రావు పేర్కొన్నారు. బుధవారం రుద్రూరు మండల కేంద్రంలో నిర్వహించిన శాంతి కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. విద్యుత్ శాఖ అధికారులు విద్యుత్‌ను ఉచితంగా ఇవ్వనున్నారని, అందుకు సంబంధించిన కేబుల్ వైర్లను తెచ్చుకోవాలని సూచించారు. అధ్యాత్మికత ఉట్టిపడేలా వినాయక మండపాల వద్ద కార్యక్రమాలు నిర్వహించుకోవాలని కోరారు. వినాయక మండపాల వద్ద నిర్వాహకులు రాత్రివేళల్లో ఉండాలన్నారు. బ్యాండ్ మేళాలతో ఊరేగింపు నిర్వహించాలని, నిమజ్జనం రోజున డీజేలు పెట్టరాదని తెలిపారు. పర్యావరణ పరిరక్షణ కోసం మట్టి గణపతి విగ్రహాలను ఏర్పాటు చేసుకోవాలని నిర్వాహకులకు విజ్ఞప్తి చేశారు. వినాయక చవితి వేడుకలను శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని సూచించారు. మండపాల నిర్వాహకులు పూర్తి వివరాలతో పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. మైనారిటీ సోదరులు సైతం మిల్ ఉన్ నబీ పండుగను సైతం ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా చూడాలని తెలిపారు. ఈ సమావేశంలో సీఐ జయేష్‌రెడ్డి, ఎస్సై సాయన్న, రుద్రూరు మాజీ జడ్పీటీసీ గంగారాం, నాయకులు,మండపాల నిర్వాహకులు, మైనారిటీలు పాల్గొన్నారు.

డిచ్‌పల్లి: డిచ్‌పల్లి పోలీస్ స్టేషన్‌లో శాంతిభద్రతలపై ప్రజలకు బుధవారం సీఐ మల్లేష్ అవగాహన కల్పించారు. గ్రామాల్లో గణేష్ మండపాలలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. అవాంచనీయ సంఘటనలు జరుగకుండా చూసుకోవాలని, అనుమానాస్పద వ్యక్తులపై నిఘా ఉంచి తమకు సమాచారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో మండలంలోని అన్ని గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు, యువజన సంఘాల నాయకులు పాల్గొన్నారు.

కోటగిరి: గణేష్ నవరాత్రి ఉత్సవాలను, మిలాద్ ఉన్ నబీని శాంతియుతంగా నిర్వహించుకోవాలని రుద్రూర్ సీఐ జయేష్ రెడ్డి సూచించారు. కోటగిరి పోలీస్ స్టేషన్ ఆవరణలో బుధవారం శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సీఐ మాట్లాడుతూ పండుగలను శాంతియుతంగా జరుపుకోవాలని సూచించారు. గణేష్ మండపాల నిర్వాహకులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. మండప నిర్వాహకులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు నమోదు చేసుకోవాలని సూచించారు. నిమజ్జన సమయంలో తగిన జాగ్రత్తలు పాటించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ సందీప్, ట్రాన్స్‌కో ఏఈ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఎడపల్లి: పండుగలను శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని బోధన్ ఏసీపీ శ్రీనివాస్ అన్నారు. బుధవారం ఎడపల్లి మండల కేంద్రంలోని విఆర్ఆర్ ఫంక్షన్ హాలులో ఏర్పాటు చేసిన శాంతి కమిటీ సమావేశంలో ఆయన హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న వినాయక చవితి పండుగను, మిలాద్ ఉన్ నబీ పండుగలను శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని సూచించారు. రెండు పండుగలు ఒకేసారి వస్తున్నాయని హిందూ, ముస్లింలు సోదర భావంతో పండుగలను జరుపుకోవాలన్నారు. గణేష్ మండపాల నిర్వాహకులు పోలీస్ స్టేషన్ రిజిష్టర్ చేసుకోవాలని ఆయన సూచించారు. వినాయక మండపాల నిర్వాహకులు రాత్రిపూట కనీసం ముగ్గురు మండపం దగ్గర నిద్రించాలని, అగ్ని ప్రమాదాలు జరుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, డీజే సౌండ్ పెట్టకూడదని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎడపల్లి ఎస్సై వంశీ కృష్ణా రెడ్డి, గణేష్ మండపాల నిర్వాహకులు, ముస్లిం మత పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

సీపీఎస్‌ను రద్దు చేయాలి: మోహన్‌రెడ్డి

కోటగిరి,సెప్టెంబర్4: ప్రభుత్వం సీపీఎస్‌ను రద్దు చేసి పాత పింఛన్ విధానాన్ని తీసుకురావాలని పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. కోటగిరి జిల్లా పరిషత్ ఆవరణలో బుధవారం పీఆర్టీయూ మండల శాఖ సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఉపాధ్యాయులు తమసమస్యలను పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడికి వివరించారు. ప్రభుత్వం నుంచి రావాల్సిన నాలుగు డీఏలను, పీఆర్సీని ఇప్పించాలని కోరారు. ఎస్‌జీటీలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని, 317జీవో ప్రకారం వేరే జిల్లాకు వెళ్లిన వారిని సొంత జిల్లాకు వచ్చేలా కృషి చేయాలని కోరారు.ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు మోహన్ రెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి పీఆర్టీయూ నిరంతరం కృషి చేస్తుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పీఆర్టీయూ జిల్లా గౌరవ అధ్యక్షులు శంకర్, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు శానం సాయిలు, డివిజన్ ఇన్‌చార్జి శంకర్, ఎంఈవో నాగనాథ్, ఎంఎన్‌వో శ్రీనివాస్ రావు, మండల ప్రధాన కార్యదర్శి కృష్ణ మోహన్, శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కోటగిరిలో మాట్లాడుతున్న పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు మోహన్ రెడ్డి

విద్యార్థిని రక్షిత మృతిపై నిజానిజాలు నిగ్గు తేల్చాలి



బోధన్ ఆర్డీవో కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న ఏబీవీపీ నాయకులు

బోధన్‌టౌన్,సెప్టెంబరు 4: రుద్రూర్ వ్యవసాయ పాలిటెక్నిక్‌లో మొదటి సంవత్సరం చదువుతున్న రక్షిత మృతిపై సమగ్ర విచారణ జరిపి నిజనిజాలు నిగ్గు తేల్చాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షులు గౌతంకుమార్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా బోధన్ ఆర్డీవో కార్యాలయంలో వినతిపత్రం అందించిన అనంతరం ఆయన మాట్లాడుతూ వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతున్న రక్షిత శనివారం రోజున ఉదయం హస్టల్ బాత్‌రూమ్‌లో ఉరికి వేలాడుతూ మృతదేహం ఉందని గుర్తు చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ వారి తల్లిదండ్రులు వచ్చే వరకు ఆగకుండా బోధన్ ఆసుపత్రికి తరలించారని ఆరోపించారు. విద్యార్థి చనిపోయే ముందు హస్టల్‌లో సీసీ కెమెరాలు పని చేయడం లేదని టెక్నికల్ కారణాల వల్ల సీసీ ఫుటేజీ డిలీట్ అయిందని కారణాలు చెప్పడం పలు అనుమానాలకు దారి తీస్తుందని ఆరోపించారు.కావున విద్యార్థి మృతిపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షులు కార్తీక్, సుధాకర్, రాహుల్, అనిల్, ఆకాష్, లక్ష్మణ్, ఓంకార్, తదితరులు పాల్గొన్నారు.

ఈపాస్ ద్వారానే ఎరువులు విక్రయించాలి

● జిల్లా వ్యవసాయాధికారి వాజిద్ హుస్సేన్

కమ్మర్‌పల్లి, సెప్టెంబరు4: ప్రభుత్వ నిబంధనలప్రకారం ఎరువుల డీలర్లు ఈ పాస్ ద్వారనే రైతులకు ఎరువులు విక్రయించాలని జిల్లా వ్యవసాయాధికారి వాజిద్ హుసేన్ అన్నారు. బుధవారం కమ్మర్‌పల్లి మండలం మారుమూలగ్రామం కోనాపూర్‌లోని ఎరువులదుకాణాన్ని ఆయన తనిచేశారు. స్టాక్‌రిజిస్టర్‌ను ఆయన పరిశీలించారు. ప్రస్తుఅవసరాలమెరకే రైతులకు యూరియా విక్రయించాలన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతు వర్షాలు వరదలకారణంగా ఎరువులు దిగుమతి ఆలస్యమయ్యే అవకశాలు ఉన్నందున రైతులందరు యురియి ఉన్నస్టాక్‌లో సర్దుబాటు చేసుకోవాలని అన్నారు. ప్రస్తుత అవసరాలమెరకే ఎరువులు కొనుగోలు చేస్తె రైతులందరికి సరిపడ ఎరువులు అందుతాయన్నారు. వరదలకారణం ఎరువులదిగుమతి కావడంలేదని వర్షాలు తగ్గుముఖంపడితే యధావిదిగా సరఫరాఅవుతాయన్నారు. రైతులుఅవిషయంలో ఆలోచించాలన్నారు. ఆయన వెంట మండల ఇన్‌చార్జ్ ఏవో రమ్యశ్రీ, ఏఈవో ఉన్నారు.



ఎరువుల దుకాణంలో తనిఖీ చేస్తున్న డీఈవో వాజీద్ హుసేన్

శిథిలావస్థలో ఉన్న ప్రభుత్వ పాఠశాల తరలింపు



విద్యార్థులను గ్రామ పంచాయతీ భవనానికి తరలించిన దృశ్యం

బోధన్‌రూరల్,సెప్టెంబర్4: బోధన్ మండలంలోని బర్దీపూర్ గ్రామంలో శిథిలావస్థలో ఉన్న ప్రభుత్వ పాఠశాలను బోధన్ ఎంపీడీవో బాల గంగాధర్ బుధవారం ఆకస్మికంగా పరిశీలించారు. పాఠశాల పైకప్పు భవనం పెచ్చులూడి ప్రమాదకరంగా ఉండడంతో పాఠశాలలో చదువుతున్న 35మంది విద్యార్థులను గ్రామ పంచాయతీ భవనానికి తరలించారు. పాఠశాల మరమ్మత్తులు చేపట్టి త్వరగా పూర్తి అయ్యేలా కాంట్రాక్టర్‌కు అప్పగించామన్నారు. పనులు పూర్తి అయ్యేంత వరకు పాఠశాల గ్రామ పంచాయతీ భవనంలోనే కొనసాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రుణమాఫీ కాని రైతు కుటుంబాల సర్వే

కమ్మర్‌పల్లి, సెప్టెంబరు4: రాష్ట్రప్రభుత్వం అమలు చేస్తున్న రెండులక్షల వరకు రుణమాఫీ వర్తించని అర్హులైన రైతుల కుటుంబాల నిర్ధారన సర్వే కార్యక్రమాన్ని మండల వ్యవసాయశాఖ చేపట్టింది. మండలంలో షేడ్యుల్ ప్రకారం బుధవారం అమీర్‌నగర్‌లో మండల ఇన్‌చార్జ్ ఏవో టీ రమ్యశ్రీ, ఏఈవోలు టి రమేష్, సాయిరాం రాజు గ్రామంలో చేపట్టి రుణమాఫీ వర్తించని అర్హులైన రైతుల కుటుంబాల నిర్ధారాన సర్వె కార్యక్రమాన్ని చేపట్టి రైతులనుండి ధృవీకరణపత్రాలు సేకరించారు. ఈ మెరుకు రేషన్‌కార్డులు లేని రైతుల వివరాలను సేకరించి నిర్ధారించారు.

బైక్‌ను ఢీకొన్న గుర్తుతెలియని వాహనం

నవీపేట, సెప్టెంబర్ 4: మండలంలోని రాంపూర్ సమీపంలో బుధవారం బైక్‌ను వెనుక నుంచి గుర్తు తెలియని వాహనం ఢీకొట్టిన ఘటనలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయని స్థానికులు తెలిపారు. రెంజల్ మండలం బాగేపల్లికి చెందిన కమ్మరి నరేష్, బోయి పోశెట్టి అనే ఇద్దరు బైక్‌పై నవీపేట నుండి తమ స్వగ్రామానికి వెళ్తుండగా రాంపూర్ సమీపంలో వెనుక నుండి బైక్‌ను గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో బైక్‌పై వెనుక కూర్చున్న బోయి పోశెట్టి కాలికి తీవ్ర గాయాలు కాగా నరేష్‌కు స్వల్ప గాయాలయ్యాయని వారు పేర్కొన్నారు. బాధితులను 108లో నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ విషయంపై ఎస్ఐ వినయ్‌ను వివరణ కోరగా తమకు ఎటువంటి ఫిర్యాదు అందలేదని అన్నారు.

'ఉత్తమ సేవలను అందిస్తాం'

నందిపేట, సెప్టెంబరు 4: జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ ద్వారా రైతులకు ఉత్తమ సేవలను అందిస్తామని డీసీసీబీ అధ్యక్షుడు కుంట రమేష్‌రెడ్డి తెలిపారు. బుధవారం నందిపేట మండలంలోని కుద్వాన్‌పూర్ సొసైటీ పరిధిలో ఉన్న వన్నెల్(కె) గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న డీసీసీబీ వన్నెల్ శాఖ బ్రాంచ్ భవన నిర్మాణానికి తెలంగాణ మార్క్‌ఫెడ్‌చైర్మన్ మార గంగారెడ్డి ఆయన భూమిపూజ చేశారు. వన్నెల్ శాఖ బ్రాంచ్ నిర్మాణానికి స్థలాన్ని కేటాయించిన వీడీసీసభ్యులను ఆయన అభినందించారు. ఈ సందర్భంగా జిల్లా కేంద్రం సహకార బ్యాంకు చైర్మన్ కుంట రమేష్‌రెడ్డి మాట్లాడుతూ రైతులు సొసైటీలో తీసుకున్న రుణాలను నిర్ణీత సమయంలో చెల్లిస్తే వారికే లాభదాయకంగా ఉంటుందన్నారు. సకాలంలో రుణాలు అందిస్తే రైతులకు వారి కుటుంబసభ్యులకు బీమా పథకం వర్తిస్తుందని తెలిపారు. పంట రుణాలే కాకుండా రైతులకు ఇతర రుణాలను ఇచ్చే యోజనలో ఉన్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాలకవర్గ సభ్యులు శరత్, రమేష్, పాటిల్, సాయిరెడ్డి, భోజన్న, లింగయ్య, భూమన్న, ఆనంద్, బ్రాంచ్ సీఈవో నాగభూషణం, కుద్వాన్‌పూర్, డొంకేశ్వర్, సొసైటీ చైర్మన్‌లో వాకిడి కార్తికొరెడ్డి, భరత్, బ్యాంకు సిబ్బంది, ఆయా సొసైటీల సీఈవోలు, డైరెక్టర్‌లు, సిబ్బంది, తదితరులు ఉన్నారు.

కందకుర్తి గోదావరిని సందర్శించిన ట్రైనీ ఐఏఎస్

రెంజల్, సెప్టెంబర్ 4: గత మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు మహారాష్ట్ర, తెలంగాణ సరిహద్దులో ఉన్న కందకుర్తి గోదావరి బ్రిడ్జిని ట్రైనీ ఐఏఎస్ అధికారి సాకేత్ కుమార్ బుధవారం పరిశీలించారు. ఎగువ ప్రాంతం నుంచి భారీగా నీరు రావడంతో గోదావరి నీటి మట్టం బ్రిడ్జిని అనుకుని ప్రవాహిస్తుండడంతో అక్కడ నివసించే గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ శ్రావణ్‌కుమార్‌కు సూచించారు. ఎగువ ప్రాంతం నుండి అధిక నీరు రావడం చేత చుట్టు పక్కన గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, గోదావరి వద్ద తగిన ఏర్పాట్లను చేపట్టాలని, పశువుల కాపర్లు, చేపల వేటకు వెళ్లే వారిని ఇటు వైపుగా రానివ్వకూడదని సూచించారు. ఆయన వెంట ఎంపీడీవో శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శులు రాజేందర్ రావు, తదితరులు పాల్గొన్నారు.

'విపత్తు ప్రకటించి సహాయక చర్యలు చేపట్టాలి'

ఆర్మూర్‌టౌన్, సెప్టెంబరు 4: రెండు తెలుగు రాష్ట్రాల ప్రజలు భారీ వర్షాలతో అతలకుతలం అవుతున్నారని వెంటనే జాతీయ విపత్తుగా ప్రకటించి సహయక చర్యలు చేపట్టాలని సీపీఐఎంఎల్ మాస్‌లైన్ ప్రజాపంథ జిల్లా సహయక కార్యదర్శి వి.ప్రభాకర్, డివిజన్ కార్యదర్శి బి.దేవరాంలు డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని కుమార్‌నగర్ భవన్‌లో వారు మాట్లాడుతూ జాతీయ విపత్తుగా ప్రకటించే విధంగా ఎంపీ చొరవ తీసుకొని కేంద్ర ప్రభుత్వానికి నచ్చజెప్పాలని డిమాండ్ చేశారు.

గోవింద్‌పేట్ పాఠశాలను పరిశీలించిన జడ్పీసీఈవో

ఆర్మూర్‌రూరల్, సెప్టెంబరు4: ఆర్మూర్ మండలం గోవింద్‌పేట్ గ్రామంలో బుధవారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అసం పూర్తిగా ఉన్న పనులను జిల్లా పరిషత్ సీఈవో బి.ఉషా పరిశీలిం చారు. తరగతి గదులు పిల్లర్ల వరకే నిర్మించి నిలిపివేశారు. అంపూర్తి పనులకు నిధులు మంజూరు చేయడానికి జడ్పీసీఈవో పనులను పరి శీలించారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో ఓటర్ల జాబిత తయారీపై అధికారులతో సమావేశం నిర్వహించారు. గ్రామపంచాయతీ ఓటర్ల జాబితాను వార్డుల వారీగా తయారు చేయాలని, ఏలాంటి లోపాలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సాయిరాం, పంచాయతీరాజ్ ఏఈ నితిష్, కార్యదర్శి, తదితరులు పాల్గొన్నారు.

బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న సుధాకర్

పెద్దబజార్, సెప్టెంబరు 4: జిల్లా పోలీస్ కమీషనర్ ఉన్నత విద్యాశాఖ అధికారుల నేతృత్వంలో సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకొని రక్షిత కుటుంబానికి న్యాయం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి సుధాకర్ అన్నారు. బుధవారం నగరంలోని సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రుద్రూర్ వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతున్న మృతి ఘటనపై సమగ్ర విచారణ జరపాలన్నారు.ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా నాయకులు రఘురాం, సురేష్, అలీ, ఇమ్రాన్, ఫిరోజ్, తదితరులు పాల్గొన్నారు.

కిసాన్‌నగర్ వైన్స్‌లో చోరీ

ముప్కాల్, సెప్టెంబరు4: బాల్కొండ మండలంలోని కిసాన్‌నగర్ గ్రామంలోని మంగళవారం రాత్రి ఓవైన్స్‌లో షట్టర్ తళాలు పగులకొట్టి దొంగతనానికి పాల్పట్టు ఎఎస్సై రాజేశ్వర్ తెలిపారు.ఆయనతెలిపిన వివరాల ప్రకారం మంగళవారం రాత్రి గుర్తుతెలియని దొంగలు చోరీకి పాల్పడ్డగా ప్రతీ యాజమాన్యం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి క్లూస్ టీంతో కేసును దర్యాప్తు చేస్తునట్టు ఎస్సై తెలిపారు. సంఘటన స్థలాన్ని ఆయన పరిశీలించారు.

సానిటేషన్ పనులను పక్కాగా చేపట్టాలి

ముప్కాల్, సెప్టెంబరు4: ఇటీవల కురిసిన భారీ వర్షాల దృష్ట్యా అంటు వ్యాధులు ప్రభలకుండా సానిటేషన్ పనులు పక్కగా చేపట్టాలని గ్రామపంచాయతీ సిబ్బందిని డీఎల్‌పీవో శివకృష్ణ ఆదేశించారు. బుధవారం బాల్కొండ మండలంలోని చిట్టాపూర్ గ్రామాన్ని ఆకస్మికంగా సందర్శించారు. గ్రామంలోని ప్రధాన కూడలి వద్ద పిచ్చి మొక్కలు, నిలిచిన వాటర్ ఉండకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. తాగునీటి ట్యాంకులను ఎప్పటికప్పుడు శుభ్రపర్చాలని అన్నారు. ఎప్పటికప్పుడు దోమల నివారణ కొర్కై ఫాగింగ్ చేయించాలని అధికారులకు తెలిపారు. ఆయన వెంట పంచాయతీ సిబ్బంది, ఆశ వర్కర్‌లు, సెక్రెటరీలు పాల్గొన్నారు

తూనికలు, కొలతల అధికారుల దాడులు

నవీపేట,సెప్టెంబరు4: మండల కేంద్రంలో బుధవారం పలు దుకాణాలపై తూనికలు, కొలతల అధికారులు దాడులు జరిపారు. ఆయా దుకాణాలలో సమగ్ర వివరాలు లేని సరుకులను విక్రయిస్తున్నందున మూడు దుకాణాలపై ఐదు కేసులు నమోదు చేయడం జరిగిందని అధికారులు తెలిపారు.ఈకార్యక్రమంలో జిల్లా తూనికలు, కొలతల అధికారి సయ్యద్ సుజాత్ అలీ,రవీందర్, సురేందర్, తదితరులున్నారు.

'మండపాల పేర్లు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలి'

సిరికొండ సెప్టెంబరు 4 : గ్రామాల్లో వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించే యువజన సంఘాలు, ఆలయ కమిటీల వారు వెంటనే తమ తమ సంఘాల పేర్లను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని సిరికొండ ఎస్సై ఎల్.రామ్ సూచించారు. ఈ నెల ఏడున వినాయకచవితి సందర్భంగా ప్రతిష్ఠించే విగ్రహాలు సంఘాల పేర్లు, స్థలాల పేర్లను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని ఎస్సై సూచించారు. ఇప్పటి వరకు ఏ గ్రామానికి చెందిన వారు కూడా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోలేదని ఆయన చెప్పారు. వెంటనే తమ మండపాల పేర్లను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని ఎస్సై కోరారు.

వరదకాలువకు 19వేల క్యూసెక్కుల నీటి విడుదల

ముప్కాల్, సెప్టెంబరు 4: శ్రీరాంసాగర్ ప్రాజెక్టు ప్రధాన కాలువలలో ఒకటైన వరదకాలువ హెడ్‌రెగ్యులేటర్ ద్వారా 19వేల క్యూసెక్కుల నీటి విడుదల జరుగుతోంది. ప్రాజెక్టు ఎగువ గోదావరి పరివాహక ప్రాంతం నుంచి భారీ వరద వస్తుండడంతో కాలువకు నీటిని వదులుతున్నట్టు ప్రాజెక్టు అధికారులు తెలిపారు. ఉదయం 17 వేల క్యూసెక్కుల నుంచి 19 వేలకు పెంచి నీటిని వదులుతున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1091.00అడుగులు (80.50 టీఎంసీ)లు కాగా ప్రస్తుతం 1089.60 అడుగులు (75.31 టీఎంసీల) నీరు నిల్వ ఉంది.

నందిపేట పీహెచ్‌సీ తనిఖీ

నందిపేట, సెప్టెంబరు 4: మండల కేంద్రంలోని మండల ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని బుధవారం మండల ప్రత్యేక అధికారిణి డాక్టర్ జగన్నాథచారి తనిఖీ చేశారు. ఓపీ రిజిష్ట్రర్‌ను పరిశీలించి వివరాలు అడిగితెలుసుకున్నారు. అంతేగాకుండా సీజనల్ వ్యాధులు నిర్మూలనకు చేపట్టిన చర్యల గురించి వాకబు చేశారు. గ్రామంలో ఉచిత వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొని ప్రతీఒక్కరు ఆరోగ్యంగా ఉండడానికి ప్రయత్నం చేయాలని డాక్టర్ జగన్నాథచారి కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాస్‌రావు, మండల వైద్యాధికారి డాక్టర్ ప్రవీన్, సూపర్‌వైజర్, సురేంధర్, బాస్కర్ పాల్గొన్నారు.

మృతుడి కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే

బోధన్‌రూరల్, సెప్టెంబర్ 4: సాలూర మండలంలోని ఖాజాపూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు గంగారాం ప్రజలకు చేసిన సేవలు మరువలేనివని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి అన్నారు. ఖాజాపూర్ గ్రామ మాజీసర్పంచ్ గంగారాం ఇటీవల మృతిచెందగా ఆయన కుటుంబాన్ని బుధవారం ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి పరామర్శించారు. కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు చిద్రపు అశోక్, జిల్లా నాయకులు బిల్ల రామ్మోహన్, పులి శ్రీనివాస్, టీపీసీసీ డెలిగేట్ గంగాశంకర్, మండల అధ్యక్షులు నాగేశ్వర్ రావు పాల్గొన్నారు.

విద్యార్థులకు టై, బెల్ట్‌ల వితరణ

ఆర్మూర్‌రూరల్, సెప్టెంబరు4: ఆర్మూర్ పట్టణంలోని నవనాథపురం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు పాఠశాల హెచ్‌ఎం చంద్రశేఖర్‌రెడ్డి టై, బెల్ట్‌లను వితరణ చేశారు. గతంలో ఇదే పాఠశాలకు ఆయన కంప్యూటర్ డిజిటల్ విద్యాబోధనకు టీవిని వితరణ చేశారు. పాఠశాలను ఆదర్శంగా తీర్చిదిద్దుతున్న హెచ్‌ఎం చంద్రశేఖర్‌రెడ్డి ఎంఈవో రాజగంగారాం అభినందించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుల లక్ష్మీనర్సయ్య, జీఎల్.చలం, ఉపాధ్యాయులు తులసీ, జ్యోతి, అనురాధ, విజయ, తదితరులు పాల్గొన్నారు.

'విద్యారంగాన్ని బలోపేతం చేయాలి'

బోధన్‌టౌన్,సెప్టెంబర్4: ప్రభుత్వ విద్యాసంస్థల్లో మెరుగైన వసతులు కల్పిస్తూ విద్యారంగాన్ని బలోపేతం చేయాలని ఏబీవీపీ నగర కార్యదర్శి కునాల్ అన్నారు. బుధవారం బోధన్ పట్టణంలో అఖిల భారత విద్యార్థి పరిషత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పేద, మధ్య తరగతుల విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలన్నారు. ఫీజు నియంత్రణ చట్టాన్ని అమలు చేసి కార్పొరేట్, ప్రైవేటు విద్యాసంస్థల వ్యాపారాన్ని అరికట్టాలన్నారు.

బాధిత కుటుంబాలకు ఆర్థిక సహాయం అందించాలి



కూలిన ఇంటిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ధన్‌పాల్

పెద్దబజార్, సెప్టెంబరు 4: ఇటీవల కురుస్తున్న భారీ వర్షాల కారణంగా నగరంలో పలుచోట్ల ఇండ్లు కూలిపోవడంతో బాధిత కుటుంబాలకు రూ.5 లక్షల ఆర్థిక సహాయం అందించాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ అన్నారు. నగరంలోని కోటగల్లిలో రెండు రోజుల క్రితం వర్షం పడి ఇండ్లు కూలిపోవడంతో పశికంటి రాజేష్ కుటుంబాన్ని బుధవారం పరామర్శించారు. అనంతరం జరిగిన సంఘటనపై ఆర్డీవోతో ఫోన్‌లో మాట్లాడారు. ఇప్పటి వరకు నష్టపోయిన బాధిత కుటుంబాలు ఎన్ని అని ఎమ్మెల్యే అడుగగా తడపడిన ఆర్డీవోపైన మండిపడ్డారు. సాయంత్రం వరకు నివేదిక అందించాలన్నారు. నష్టపోయిన బాధిత కుటుంబాలను ఆర్థికంగా ఆదుకోవాలని ఆదేశించారు.ఆయన మాట్లాడుతూ నగరంలో ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా మున్సిపల్ సమీక్ష సమావేశం నిర్వహించి అధికారులకు ఆదేశాలు ఇవ్వడం జరిగిందన్నారు. నగరంలో శిథిలావస్థలో ఉన్నఇళ్లపై దృష్టి పెట్టాలని ఎటువంటి ఆస్థి, ప్రాణనష్టం జరుగకముందే చర్యలు తీసుకోవాలని టౌన్‌ప్లానింగ్ అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పల్నాటి కార్తిక్, హరీష్‌రెడ్డి, భాను, తదితరులు పాల్గొన్నారు.

పెద్దబజార్: అర్బన్ నియోజకవర్గం పరిధిలోని అనారోగ్యంగా బాధపడుతూ వివిధ ఆసుపత్రుల్లో చికిత్స పొందిన పలువురు పేదలకు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను బుధవారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ 61 మంది లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రైతులు అధైర్యపడొద్దు..అండగా ఉంటాం: బోధన్ ఎమ్మెల్యే



హంగర్గ గ్రామంలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి

బోధన్‌రూరల్,సెప్టెంబర్4: రైతులు అధైర్య పడవద్దని ప్రభుత్వం అండగా ఉంటుందని, రైతాంగ సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి అన్నారు. బుధవారం బోధన్ మండలంలోని హంగర్గ గ్రామాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా నీటిలో మునిగిన పంటలను పరిశీలించారు. గ్రామంలో పర్యటించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వరద నష్టంపై అధికారులు సమగ్ర విచారణ చేపట్టి ప్రభుత్వానికి నివేదిక ఇవ్వాలన్నారు. పంట నష్టపోయిన రైతాంగాన్ని ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటుందన్నారు. రైతులు ఎలాంటి ఆందోళన చెందవద్దన్నారు.హంగర్గ, కొప్పర్గ, బికెనెల్లి, ఖండ్గావ్ తదితర గ్రామాలలో 1300ఎకరాలకు పైగా పంట నష్టం వాటిల్లిందన్నారు. ఎస్సారెస్పీ బ్యాక్ వాటర్ ముంపుకు గురైన పంటలను కాపాడేందుకు భారీ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ దృష్టికి హంగర్గ గ్రామస్థుల సమస్యను తీసుకెళ్తానన్నారు. శ్రీరాంసాగర్ అవుట్ ఫ్లో పెంచేలా చర్యలు చేపడతామన్నారు. ఎస్సారెస్పీ బ్యాక్ వాటర్ వల్ల బోధన్ నియోజకవర్గంలోని ఎడపల్లి, రెంజల్, నవీపేట, బోధన్ మండలాల్లోని పలు గ్రామాలలో పంట నష్టం వాటిల్లుతుందన్నారు.

● లో లెవల్ వంతెన ఏర్పాటుకు కృషి చేస్తాం

హంగర్గ గ్రామ రైతాంగ సమస్యల పరిష్కారం కోసం లో లెవల్ వంతెన నిర్మాణానికి కృషి చేస్తామన్నారు. ఈ సందర్భంగా ఇరిగేషన్ అధికారుతో మాట్లాడుతూ లోలెవల్ వంతెనకు అవసరమైన అంచన ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. లో లెవల్ వంతెన నిర్మిస్తే హంగర్గ గ్రామస్థులకు నీలా గ్రామానికి మధ్యన ఉన్న పంట పొలాలకు సంబంధించిన సమస్యలు పరిష్కారం అవుతాయని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉర్దూ అకాడమీ ఛైర్మన్ తాహెర్ బిన్ హందాన్, టీపీసీసీ డెలిగేట్ గంగాశంకర్, మండల అధ్యక్షులు నాగేశ్వర్ రావు, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆదినారాయణ, వై.నరేందర్ రెడ్డి, అల్లె రమేష్, అల్లె జనార్ధన్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ వసంత్, గ్రామస్థులు,పాల్గొన్నారు.

● ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి ప్రత్యేక పూజలు

బోధన్‌రూరల్: ఓ గణపతి మహదేవా.. పంట నష్టపోయినరైతాంగాన్ని, పంటలను కాపాడాలని బోధన్ ఎమ్మెల్యేపూజలు నిర్వహించారు.

ఎడపల్లి: నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు అలీసాగర్ దిగువన ఉన్న పంట పొలాలు నీటిలో మునగకుండా చర్యలు తీసుకోవాలని మాజీమంత్రి బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి అన్నారు. బుధవారం ఎడపల్లి మండల కేంద్రంలోని కుర్నాపల్లి గ్రామ శివారులో ఉన్న బాలమ్మ వాగును, ఠాణాకలాన్ గ్రామశివారులో ఉన్న అలీసాగర్ గేట్లను ఎత్తి దిగువకు నీరు వదలడంతో ఆ నీటి ప్రవాహాన్ని ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఇరిగేషన్ మంత్రిగా ఉన్నసమయంలో అలీసాగర్ రిజర్వాయర్‌లో నీటిని నింపడానికి మల్కాపూర్ చెరువు వద్ద చెక్ డ్యాం నిర్మించి అలీసాగర్ రిజర్వాయర్‌కు నీటిని మళ్ళించడం జరిగిందన్నారు.

రెంజల్: రైతుల సంక్షేమం కోసం, రైతుల శ్రేయస్సే పరమావధిగా నిరంతరం కృషి చేసే ఏకైక పార్టీ కాంగ్రెస్ పార్టీ, నష్టపోయిన ప్రతి రైతును ప్రభుత్వం ఆదుకుంటుందని మాజీమంత్రి, ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని కందకుర్తి గ్రామంలో నీట మునిగిన పంటలతో పాటు గోదావరి నది ప్రవాహాన్ని పరిశీలించారు. ఆయన వెంట ఉర్దూ అకాడమీ ఛైర్మన్ తాహెర్‌బిన్ హందాన్, జిల్లా అధ్యక్షులు మానాల మోహన్ రెడ్డి, అంతిరెడ్డి రాజిరెడ్డి, పార్టీ మండల అధ్యక్షులు మొబిన్ ఖాన్, మాజీ మండల అధ్యక్షులు తదితరులు ఉన్నారు.

వరద ప్రాంతాలను పరిశీలించిన కమిషనర్



నగరంలో పలు ప్రాంతాలను పరిశీలిస్తున్న కమిషనర్

సుభాష్‌నగర్, సెప్టెంబరు 4: వరద ఉధృతంగా ప్రవహించిన ప్రాంతాలను నగర పాలక సంస్థ కమీషనర్ మంద మకరంద్ పరిశీలించారు. బుధవారం నగరంలోని నిజామాబాద్, ఖానాపూర్ వెళ్లే బ్రిడ్జిని పరిశీలించారు. అనంతరం నగర శివారులోని మానిక్‌భండార్ ప్రాంతంలో రోడ్డుపై పారుతున్న నీటిని పరిశీలించారు. మానిక్‌భండార్ చెరువులోని నీరు అలుగు పారి పెద్ద ఎత్తున నేషనల్ హైవేపై పారడంతో ప్రజలు, ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారన్న విషయాన్ని తెలుసుకొని నీటిని పూలాంగ్ వాగులోకి వెళ్లేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఖానాపూర్ బ్రిడ్జి ఉధృతంగా పారడంతో అటువైపు వెళితే ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నందున అటువైపు వెళ్లకుండా భారీ కేడ్‌లను ఏర్పాటు చేసేలా అధికారులను ఆదేశించారు. వరద ఉధృతి దృష్ట్యా ఖానాపూర్ బ్రిడ్జిపై ఎవరూ వెళ్లకూడదని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

జిల్లాలో ఇద్దరు సీఐల బదిలీలు

ఖిల్లా/బోధన్, సెప్టెంబరు 4: జిల్లాలో ఇద్దరు సీఐలను బదిలీ చేస్తూ తాత్కాలిక ఉత్తర్వులను బుధవారం పోలీస్‌కమిషనర్ కల్మేశ్వర్‌సింగెనెవార్ జారీచేశారు. నగరంలోని ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న వి.వెంకటనారాయణను బోధన్‌టౌన్ ఎస్‌హెచ్‌వోగా పనిచేస్తున్న ఎస్.వీరయ్యను ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌గా బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీచేశారు. ఈఉత్తర్వులు కేవలం తాత్కాలిక అటాచ్‌మెంట్ అని ఆయన ప్రకటనలో తెలిపారు.

ఆర్మూర్ ఎక్సైజ్ ఎస్సై సస్పెండ్

ఆర్మూర్‌టౌన్, సెప్టెంబరు4: ఆర్మూర్‌ఎక్సైజ్ ఎస్సైగంగాధర్‌ను ఉన్నతాధికారులు సస్పెండ్ చేసినట్టు తెలిసింది.ఇటీవల నిర్మల్ జిల్లా పోలీసులు క్రిప్టో కరెన్సీబిట్‌కాయిన్ పేరుతోపలువురిని నిందితులను అరెస్టు చేయగా అందులో ఆర్మూర్ ఎక్సైజ్ ఎస్సై గంగాధర్ నిందితులలో ఒకరు. విషయం ఉన్నతాధికారులకు తెలియడంతో సస్పెండ్ చేసినట్టు తెలిసింది.

వృద్ధురాలి మృతికి కారణమైన వ్యక్తికి జైలు

వర్ని,సెప్టెంబర్4: చందూర్ మండల కేంద్రంలో వృద్ధురాలి మృతికి కారణమైన కారు డ్రైవర్ పాముల అశోక్‌కు బోధన్ మెజిస్ట్రేట్ పీపీ రాణి బుధవారం ఆరు నెలల జైలుశిక్ష, వెయ్యి రూపాయల జరిమానా విధించినట్లు ఎస్‌ఐ కృష్ణ కుమార్ 2016 ఏడాది నవంబరు27న చందూర్ మండల కేంద్రంకు చెందిన శాఖమూరి బస్వాఅన్నపూర్ణ(60) ఇంటి నుంచి నడుచుకుంటూ బస్టాండ్ వైపు బంధువుల ఇంటికి నడుచుకుంటూ వెళ్తుండగా కారుతో అజాగ్రత్తగా నడిపి ఢీకొట్టడంతో బస్వా అన్నపూర్ణ మృతి చెందినట్లు తెలిపారు. ఈమేరకు కేసు నమోదు చేయగా ప్రమాదానికి కారణమైన నిందితుడు ఎడపల్లికి చెందిన పాముల అశోక్‌కు జడ్జి ఈ శిక్ష వేశారని తెలిపారు.

యువకుడి ఆత్మహత్య

మోపాల్, సెప్టెంబరు 4: మోపాల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని మోపాల్ గ్రామానికి చెందిన ప్రవీణ్ (31) అనే వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. గత కొన్ని రోజుల నుంచి కడుపునొప్పితో బాధపడుతున్నాడని అన్నారు. ఈనెల 3న కడుపునొప్పి భరించలేక ఆత్మహత్య చేసుకున్నాడు. భార్య స్వర్ణలత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై యాదగిరి తెలిపారు.

ఏర్గట్లలో మెడలో నుంచి బంగారం చోరీ

ఏర్గట్ల, సెప్టెంబరు 4: మండల కేంద్రంలో బుధవారం ద్విచక్రవాహనంపై నుంచి వెళుతున్న వారిపై బంగారం చోరి జరిగింది. స్థానిక ఎస్సై రాము తెలిపిన వివరాల ప్రకారం కమ్మర్‌పల్లి మండలం ఉప్లూర్ గ్రామానికి చెందిన ఎనుగందుల జనార్ధన్ పద్మబాయి దంపతులు ద్విచక్రవాహనంపై ఏర్గట్ల మీదుగా వెంచిర్యాల్ వెళుతుండగా వెనుక నుంచి గుర్తు తెలియని వ్యక్తి బైక్‌పై హెల్మెట్ ధరించి వారిని ఆపి పాలెం గ్రామానికి ఎలా వెళ్లాలని అడిగి పద్మబాయి మెడలో ఉన్న 18 మాసాల పుస్తెల త్రాడును లాక్కొని పారిపోగా బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాము తెలిపారు.

గురుకుల సంక్షేమ,కేజీబీవీల విద్యార్థులను కాపాడాలి

నిజామాబాద్ అర్బన్, సెప్టెంబరు 4:ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున జిల్లాలోని గురుకుల, సంక్షేమ వసతిగృహాలు, కేజీబీవీలలోని విద్యార్థులకు విష జ్వరాలు వస్తున్నాయని కావున విద్యార్థులకు అన్ని రకాల సదుపాయాలు కల్పించాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు బుధవారం కలెక్టరేట్‌లో వినతిపత్రం అందజేశారు.ఈ కార్యక్రమంలో నాయకులు నవీన్, శివాజీ, స్వామి, తదితరులు పాల్గొన్నారు.

భారీ వర్షాలకు నీట మునిగిన పంటలు



మానిక్‌బండార్‌చౌరస్తాలో రోడ్డుపై వరద నీరు



బినోలలో నీట మునిగిన వరిపంట



ముత్యలమ్మ వాగు పొంగి పొర్లడంతో రాకపోకలు బంద్

నవీపేట,సెప్టెంబరు4: ఇటీవల వరుసగా కురుస్తున్న భారీ వర్షాలకు మండలంలోని పలు గ్రామాలలో పంటలు నీట మునిగాయి. మండలంలోని కోస్లీ, మిట్టాపూర్ శివారులలో ఈ పాటికే గోదావరి నీటి ప్రవాహంతో పంటలు నీట మునగగా బుధవారం బినోల శివారులో సుమారు 150ఎకరాల వరిపంట నీట మునిగింది. మండలంలోని నాళేశ్వర్‌లో వర్షపు నీరు పలు ఇళ్లలోకి చేరింది. స్థానిక జడ్పీహెచ్ఎస్ పాఠశాల, ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఆవరణలో వర్షపు నీరు నిలిచిపోవడంతో బుధవారం పాఠశాలలకు సెలవు ప్రకటించారు. నందిగామలో 8ఇళ్లు నీట మునిగాయి. బినోల-నందిగామ మధ్యన గల రహదారిపై వర్షపు నీరు ప్రవహిస్తుంది. నాళేశ్వర్, నందిగామలో నీట మునిగిన ఇళ్లను బుధవారం ఆర్ఐ నరేష్ పరిశీలించారు. ఇదిలా ఉండగా మండలంలో బుధవారం 8.4సెంటి మీటర్ల వర్షపాతం కురిసింది.

మాక్లూర్: మండలంలోని మూడు నాలుగు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు మండలంలోని లోతట్టు ప్రాంతాలు జలమయమై ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. మండలంలోని మానిక్‌బండార్ చౌరస్తా నిత్యం ప్రయాణికులతో రద్దీగా ఉంటుంది. ప్రస్తుతం నీరు చేరడంతో పాఠశాలలకు వెళ్లే విద్యార్థులకు, ఇతర గ్రామాలకు వెళ్లే వారికి రోడ్డుపై నీరు చేరడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. తక్షణ చర్యలు చేపట్టిన చెరువుల్లో నీరు నిండడం, అలుగు ద్వారా నీరు పారించడంతో వాటిని అరికట్టలేని పరిస్థితి ఏర్పడింది. ఈ ప్రాంతంలో విద్యాసంస్థలతో పాటు 20 గ్రామాల ప్రజలు ఇట్టి మార్గం గుండా వెళ్తుంటారు. ఇకనైన ఇరిగేషన్ అధికారులు ఈ ప్రాంతంలో దృష్టి సారించి నీటిని కాల్వల ద్వారా వాగులోకి పంపిలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

సిరికొండ:ఇటీవల కురిసిన భారీ వర్షాలకు దెబ్బతిన్న పంటలను గ్రామాల వారిగా వెళ్లి పరిశీలించిన తర్వాత ప్రభుత్వానికి నివేధికను పంపిస్తామని ఏడీఏ ప్రదీప్‌కుమార్ చెప్పారు.సిరికొండ మండలం చీమన్‌పల్లి గ్రామంలో నేలకొరిగిన మొక్కజొన్న పంటను బుధవారం ఏడీఏ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో మాట్లాడుతూ గురువారం నుండి తమ సిబ్బంది అన్ని గ్రామాల్లో దెబ్బతిన్న పంటలను పరిశీలించి వివరాలను అందజేస్తారని చెప్పారు. వివరాలు అందిన వెంటనే ప్రభుత్వానికి నివేదికను పంపిస్తామన్నారు. ప్రాథమిక అంచనాల ప్రకారం వరి పంట మూడు వందల ఎకరాలు,మొక్కజొన్న యాభై ఎకరాలలో దెబ్బతిన్నట్లు వ్యవసాయ అధికారి నర్సయ్య తెలిపారు. ఏడీఏ వెంట నర్సయ్యతో పాటు ఏఈవో నిఖిల్ రైతులు ఉన్నారు.

డొంకేశ్వర్: మంగళవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి డొంకేశ్వర్ మండలంలోని మాసం చెరువు అలుగు ఉధృతంగా ప్రవహిం చింది. చెరువు కింద ఉన్న పంట పొలాలు నీట మునిగాయి. చెరువు కింద పంట పొలాలు నీట మునిశాయి. సుమారు 20ఎకరాల విస్తీర్ణంలో వరి పొలాలు నీట మునిగాయి. తెప్పల మరుగు సమీపంలో ఆర్అండ్‌బీ రోడ్డుపై నుంచి అలుగు ఉధృతంగా ప్రవహించడంతో రోడ్డు కోతకు గురైంది. రాకపోకలకు కొద్దిసేపు అంతరాయం ఏర్పడింది.

వేల్పూర్: గత నాలుగు రోజులుగా ఉరుస్తున్న భారీ వర్షాలకు పోచంపల్లి, అంక్సాపూర్ గ్రామాల మధ్య ముత్యాలమ్మ వాగు పొంగిపోర్లడంతో రాకపోకలు నిలిచిపోయాయి. ఈ సమీపంలోని ఉన్న వరదకాలువ బ్రిడ్జి వరకు ఈ ముత్యాలమ్మవాగు పారడంతో రెండు గ్రామాల మధ్య ఉన్న బీటీ రోడ్డు కోతకు గురైంది. రోడ్డుపై ఉధృతంగా నీరు ప్రవహించడంతో రాకపోకలు నిలిచిపోయాయి. మోతె గ్రామ పెద్దచెరువు పూర్తిస్థాయిలో నిండి బుధవారం ఉదయం అలుగుపారుతుంది. గత మూడు రోజుల నుంచి కురుస్తున్న భారీ వర్షం నీరు చెరువులోకి చేరి అలుగు పారుతుంది.

ఆర్మూర్‌టౌన్: మున్సిపల్ పరిధిలోని అర్ధరాత్రిలో కురిసిన వర్షానికి పలు కాలనీలోని ఇళ్లు, రోడ్లు జలమయమై రాకపోకలకు ప్రజలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొన్నారు. పట్టణంలోని హౌజింగ్‌బోర్డు, సిక్కులకాలనీలలో ఇళ్లలోకి నీరు చేరి ప్రజలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొన్నారు. సిక్కుల కాలనీలో స్థానిక కౌన్సిలర్ ఖాందేశ్ సంగీత పర్యటించి సహాయక చర్యలు చేపట్టారు.పెర్కిట్ విద్యానగర్ కాలనీలో ఇళ్లచుట్టు పక్కల నీరు చేరడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. అలాగే మామిడిపల్లిలోని హన్మాన్ ఆలయం వెనుక వీధిలో పాఠశాలలో వర్షపు నీరు చేరగా మున్సిపల్ సిబ్బంది రైల్వేబ్రిడ్జి కింద గండికొట్టి నీటిని తొలగిం చారు.

జక్రాన్‌పల్లి: మండలంలో బుధవారం తెల్లవారు జామున భారీ వర్షం కురిసింది. ఉరుములు, మెరుపులు, పిడుగులు, ఈదురుగా లు లతో భారీ వర్షం కురిసింది. దీంతో మండలంలోని అన్ని గ్రామాల్లో చెరువు అలుగు, కుంటలు పారుతున్నాయి. ఇప్పటికే పడకల్; అర్గుల్, తొర్లికొండ, బ్రహ్మణ్‌పల్లి, మునిపల్లి గ్రామాలలో పెద్దచెరువుల అలుగులు పారాయి. జక్రాన్‌పల్లి పెద్ద చెరువు నిండి అలుగు పారే దశకు చేరుకున్నాయి.

నంది పేట: మండల కేంద్రంలోని వడిగెల చెరువు శిఖంలో నిర్మించిన ప్రభుత్వ పాలిటెక్నిక్‌కు ప్రమాదం పొంచి ఉంది. మంగళవారం అర్ధరాత్రి కురిసిన భారీ వర్షంకు కళాశాల సముదాయాలు పూర్తిగా జలమయమై నాయి. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలతో పాటు నూతనంగా నిర్మించిన భవనం చుట్టూ వర్షం నీరు వచ్చి చేరింది.

ఇందల్వాయి:గత నాలుగు రోజుల నుంచి కురుస్తున్న భారీ వర్షాలకు వరదలు పోటెత్తాయి. ఇందల్వాయి మండలంలోని గన్నారం, చంద్రయాన్‌పల్లి చెరువు అలుగులు ఉధృతంగా పారి రోడ్లపై నుండి నీరు ప్రవహిస్తుండటంతో రాకపోకలు నిలిచిపోయాయి. మంగళవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి గన్నారం చెరువు అలుగు ఉధృతంగా ప్రవహించడంతో 44వ జాతీయ రహదారి పక్కనగల చిన్నవాగు వంతెనపై నుండి భారీ వరద రావడంతో సిర్నాపల్లి - నల్లవెల్లి గ్రామాల నుండి తెల్లవారు జామున వెళ్లే ఆర్టీసి బస్సు అక్కడే నిలిపివేశారు.

ధర్పల్లి - సీతాయిపేటకు రాకపోకలు నిలిపివేత



ధర్పల్లిలో రోడ్డును పరిశీలిస్తున్న అధికారులు

ధర్పల్లి, సెప్టెంబరు 4: మండల కేంద్రం నుంచి సీతాయిపేట గ్రామానికి వెళ్లే దారిలో కల్వర్టుపై నుంచి నీరు ప్రవహించడంతో బుధవారం ఉదయం నుంచి అధికారులు రాకపోకలను నిలిపివేశారు. రోడ్డుకు ఇరువైపులా భారీకేడ్‌లను ఏర్పాటు చేశారు. గ్రామస్థులు ఎవరూ అటువైపు వెళ్లవద్దని చాటింపు వేయించారు. ధర్పల్లి ఊర చెరువు అలుగు నీరు ఉధృతంగా ప్రవహించడంతో కల్వర్టుపై నుంచి భారీగా వరద నీరు ప్రవహిస్తోంది. దీంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. రెండు గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోవడంతో ప్రజలు ప్రత్యమ్నాయ మార్గాలను అన్వేషించుకుంటున్నారు. ఎగువన వర్షం భారీగా పడటంతో చెరువుల్లోకి వరద నీరు చేరడంతో కల్వర్టుపై నీరు ఉధృతంగా ప్రవహిస్తుంది. ప్రత్యేక అధికారి బాలకృష్ణ, ఈవో సైపొద్దీన్‌లు రోడ్డును పరిశీలించి బారికేడ్‌లను ఏర్పాటు చేశారు. నీటి ఉధృతి తగ్గేంతవరకు రాకపోకలు నిలిపివేస్తున్నట్లు వారు చెప్పారు.

రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయులుగా ఇద్దరు ఎంపిక

నిజామాబాద్ అర్బన్, సెప్టెంబరు 4: ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని రాష్ట్రస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులను విద్యాశాఖ ఎంపిక చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా గెజిటెడ్ హెడ్‌మాస్టర్ కేటగిరిలో 10 మందిని, స్కూల్ అసిస్టెంట్‌లు, ఎల్ఎఫ్ఎల్ హెడ్‌మాస్టర్, పిడిల కేటగిరిలో 20 మందిని, ఎస్జీటీలు, పీఈటీలు, లాంగ్వేజ్ పండిత్‌ల కేటగిరిలో 11 మందిని ఎంపిక చేయగా జిల్లా నుంచి ఇద్దరు ఉపాధ్యాయులు ఎంపికయ్యారు. నగరంలోని జీహెచ్ఎస్ దుబ్బ పాఠశాలలో ఫిజికల్ సైన్స్ స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ముద్దుకృష్ణ, గెజిటెడ్ హెడ్‌మాస్టర్ కేటగిరిలో జడ్పీహెచ్ఎస్ ఆలూర్ పాఠశాల గెజిటెడ్ హెడ్‌మాస్టర్ మీసా నరేందర్‌లు రాష్ట్రస్థాయి అవార్డులకు ఎంపికయ్యారు. వీరికి ఈనెల 5న రవీంద్రభారతిలో జరిగే కార్యక్రమంలో అవార్డులను అందజేయనున్నారు.

● టీయూ సౌత్ క్యాంపస్‌లో ఉత్తమ ఉపాధ్యాయుడి ఎంపిక

డిచ్‌పల్లి, సెప్టెంబరు 4:తెలంగాణ విశ్వవిద్యాలయం దక్షిణ ప్రాంగణం ప్రస్తుత ప్రిన్సిపాల్, జియో ఇన్ఫార్మెటిక్స్ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ సుధాకర్‌గౌడ్‌ను రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ విశ్వవిద్యాలయం నుంచి ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపిక చేసింది. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్నత విశ్వవిద్యాలయాలు, కళాశాలల నుంచి రాష్ట్ర ప్రభుత్వ ఉత్తమ ఉపాధ్యాయులను ప్రకటించింది. అందులో డాక్టర్ సుధాకర్‌గౌడ్ ఎంపికయ్యారు. ఆయన 2005లో ఉస్మానియా యూనివర్సిటీ నుంచి పీహెచ్‌డీ పట్టా సాధించారు. 2006 నుంచి 2008 వరకు ఇథియోపియాలోని జిమ్మ యూనివర్సిటీ జియోగ్రఫీ డిపార్ట్‌మెంట్‌లో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వర్తించారు. తెలంగాణ విశ్వవిద్యాయలంలో 2008-09లో కాంట్రాక్టు అధ్యాపకునిగా పనిచేశారు. 2009లో జరిగిన నియామకాల ద్వారా అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా ఎంపికయ్యారు. ప్రస్తుతం అసోసియేట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తూ దక్షిణ ప్రాంగణం ప్రిన్సిపాల్‌గా పరిపాలన బాధ్యతలు నిర్వహిస్తున్నారు. సుధాకర్‌గౌడ్‌కు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు రావడం పట్ల టియు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ యాదగిరి, అధ్యాపకులు, విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల అందజేత

డిచ్‌పల్లి, సెప్టెంబరు 4: రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి ఆదేశానుసారం డిచ్‌పల్లి మాజీ ఎంపిపి కంచెట్టి గంగాధర్ ఆధ్వర్యంలో బుధవారం మిట్టపల్లి గ్రామానికి చెందిన 12 మంది లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేశారు. రిలీఫ్ ఫండ్ మంజూరు కావడం పట్ల ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా గంగాధర్ మాట్లాడుతూ ప్రజాపాలన పేద ప్రజలకు కాంగ్రెస్ పార్టీ నిరంతరం పనిచేస్తుందని దీనికి నిదర్శనమే 12 మంది లబ్ధిదారులకు సుమారు 7లక్షల రూపాయల చెక్కులను పంపిణీ చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో మిట్టపల్లి గ్రామ కాంగ్రెస్ కార్యకర్తలు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రవేశ దరఖాస్తు గడువు పెంపు

భీమ్‌గల్,సెప్టెంబరు4:పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ 2024-25 సంవత్సరానికి డిగ్రీలో ప్రవేశం కొరకు ఈనెల 30వరకు గడువు పెంచినట్టు ప్రిన్సి పాల్ డాక్టర్ సతీష్ తెలిపారు.ఇంటర్మీడి యేట్‌లో ఉత్తీర్ణులైన ఆసక్తి గల విద్యార్థులు ఈఅవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. పూర్తి వివరాల కోసం కళాశాలలో సంప్రదించాలని ప్రిన్సిపాల్ తెలిపారు. పూర్తి వివరాలకు 9648581970 నెంబర్‌లో సంప్రదించాలన్నారు.

ధర్పల్లిలో వైద్య శిబిరం

ధర్పల్లి, సెప్టెంబరు 4: మండల కేంద్రంలోగలప్రభుత్వఆసుపత్రిలో ఆ యుర్వేద వృద్ధాప్య వైద్య శిబిరాన్ని బుధవారం జిల్లా ఆయుష్ విభాగం అధికారి నారాయణరావు ప్రారంభించారు. వృద్ధులకు దీర్ఘకాలిక వ్యాధులకు ఈ శిబిరం ఎంతో ఉపకరిస్తుందని ఆయన చెప్పారు.ఈకార్యక్రమంలో వైద్యాధికారి మాధవి, పురుషోత్తం పాల్గొన్నారు.

చికెన్ ధరలు

రకం	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	రూ.85	రూ.200	రూ. 220
వెన్‌కాబ్(కిలో)	రూ.95	రూ.205	రూ. 225

బంగారం ధరలు

బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.74000	రూ.68,250	రూ.870

సినిమా గైడ్ నిజామాబాద్

పీవీఆర్ మల్టీప్లెక్స్.. వేణుమాల్
స్క్రీన్-1 : తంగలాన్ (11.50)
: కమిటీ కుర్రాళ్లు (3.10)
: ఆయ్ మేమ్ ఫ్రెండ్ అండి (6.25)
: డిమోంటి కాలనీ-2 (9.30)
స్క్రీన్-2 : ది గోట్ (11.15, 3.00, 6.45, 10.30)
స్క్రీన్-3 : సరిపోదా శనివారం (10.30, 2.05, 5.40)
: ది గోట్ (9.15)
స్క్రీన్-4 : సరిపోదా శనివారం (11.30, 3.05, 6.40, 10.15)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్..
స్క్రీన్-1 : సరిపోదా శనివారం (1.00, 4.10, 7.20, 10.30)
స్క్రీన్-2 : ది గోట్ (12.45, 7.05)
: గబ్బర్‌సింగ్ (4.10)
: కమిటీ కుర్రాళ్లు (10.30)
స్క్రీన్-3 : ది గోట్ (10.00, 4.20, 10.30)
: గబ్బర్‌సింగ్ (1.25, 7.45)

దేవి : ది గోట్ (11.15, 2.15, 6.15, 9.15)
నటరాజ్ : గబ్బర్‌సింగ్(11.15, 2.15, 6.15, 9.15)
విజయ్ : గబ్బర్‌సింగ్ (11.15, 2.15, 6.15, 9.15)
లలితామహల్: సరిపోదా శనివారం (11.15, 2.15, 6.15, 9.15)

\- నిజామాబాద్ అర్బన్